నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | డిసెంబర్ 06, 2024 | www.navatelangana.com

కడుపునొప్పి భరించలేక బావిలో దూకి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన టేకం బాపురావు(35) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాపురావు సంవత్సరం నుండి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక బుధవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో గల బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బావిలో నీరు ఎక్కువగా ఉండడంతో గురువారం ఇంజన్ల ద్వారా నీటిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య టేకం లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.



దివ్యాంగులకు ఆటల పోటీలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యాధికారి మల్లేశం ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు భవిత సెంటర్ గూర్చి వివరించి పిల్లలు సెంటర్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, సత్యనారాయణ మూర్తి, దామోదర్‌రెడ్డి, సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిల్లలు తల్లిదండ్రులు, టీచర్లు వెంకటేశ్వర్లు, సతీష్, ఫిజియోథెరపీ వెంకటేష్ పాల్గొన్నారు.



సొంత గూడుకు మోక్షం..!

- ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకి సర్కారు సమాయత్తం
- ప్రత్యేక యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు
- తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇండ్లు
- ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి ప్రయోజనం
- ఇందిరమ్మ కమిటీల ద్వారానే అర్హుల ఎంపిక

గూడు లేక గోస పడుతున్న నిరుపేదలకు ఎట్టకేలకు సొంత గూడు దరిచేరనుంది. ఏండ్లుగా ఇంటి కోసం ఎదురుచూస్తున్న అనేక మంది పేదలకు మోక్షం లభించనుంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను ప్రారంభించింది. కొంత కాలయాపన జరిగినా.. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించడంతో దరఖాస్తులు ఈ యాప్ ద్వారా అర్హుల ఎంపిక చేపట్టనున్నారు. అధికారికంగా శుక్రవారం నుంచి ఈ క్రతువు ప్రారంభం కానుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క ఈ పథకానికి సంబంధించి పూర్తి విధి విధానాలు ఒకటి, రెండు రోజుల్లో రానున్న దృష్ట్యా మరింత స్పష్టత వస్తుంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజలకు కూడు, గూడు కల్పించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. కానీ ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల పేరిట లబ్ధి చేకూరుస్తున్నా.. గూడు సౌకర్యం మాత్రం కల్పించడం లేదు. గత పదేండ్లుగా ఇండ్ల మంజూరు లేకపోవడంతో అనేక మంది అర్హులైన నిరుపేదలు పూరి గుడిసెల్లోనే నివాసముంటున్నారు. ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయిన అనేక జంటలు పిల్లలతో చిన్నపాటి గుడిసెలు, గదుల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూంలు కట్టిస్తామని చెప్పినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని హామీనివ్వడంతో విశ్వసించిన ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని పథకాలు అమలు కాగా.. మరికొన్ని ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. తాజాగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటికే పలుమార్లు ప్రకటించినప్పటికీ.. వివిధ కారణాలతో కొంత జాప్యం జరుగుతూ వచ్చింది. ఇప్పటికే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటుచేసిన ప్రభుత్వం తాజాగా యాప్ రూపొందించింది.ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు అందించిన వారి వివరాలను పరిశీలించి గ్రామసభల్లో ఎంపిక చేయనున్నారు. ఇలా ఎంపిక చేసిన వారి జాబితాను పంచాయతీ కార్యదర్శులు యాప్‌లో అర్హుల ఎంపికను నమోదు చేయనున్నారు.

35వేల మందికి లబ్ధి..!

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ అనేక మంది పేదలు సొంత ఇండ్లు ఉన్నారు. కొందరు వారి సొంత స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసముండగా.. మరికొందరు అద్దె ఇండ్లలో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం సొంత స్థలం కలిగిన వారితో పాటు నిరుపేదలు, దళిత, గిరిజనులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఇండ్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇస్తామని చెప్పడంతో అనేక మంది అర్హులైన పేదలకు ఇండ్లు దక్కనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే కిందటేడాది డిసెంబర్ 29 నుంచి జనవరి 6 వరకు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇండ్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో 199803, నిర్మల్‌లో 193647మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 154141 మంది, మంచిర్యాల జిల్లాలో 210216 మంది దరఖాస్తులు అందించారు. ప్రస్తుతం వీటిలో ప్రభుత్వ ప్రాధాన్యం ప్రకారం అర్హులను ఎంపిక చేసి తాజాగా విడుదల చేసిన యాప్‌లో నమోదు చేస్తారు. వీరికి ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి నాలుగు విడతల్లో రూ.5లక్షల చొప్పున అందజేయనుంది. 400చదరపు గజాల్లో ఇంటి నిర్మాణానికి అనుమతించగా.. లబ్ధిదారుల ఇష్ట ప్రకారం పెంచుకునే సౌలభ్యం కూడా కల్పించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నమూనా, విధి విధానాలు ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున ఇండ్లను కేటాయించగా.. ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి ప్రయోజనం కలిగించనుంది.



యాప్‌లో ఎంపికైన అర్హుల వివరాలు నమోదు : బసవేశ్వర్, గృహనిర్మాణశాఖ పీడీ, ఆదిలాబాద్

ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరించింది. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన యాప్‌ను పంచాయతీ కార్యదర్శులకు అందించింది. వారు గ్రామాల వారీగా ఇంటి నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇంకా ఈ పథకానికి సంబంధించి పూర్తి విధి విధానాలు, నిబంధనలు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి రాగానే వాటి ప్రకారం ముందుకెళ్తాం.

అంతర్గత సమస్యల పట్ల భయం వీడాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

విద్యార్థినులు అంతర్గత సమస్యల పట్ల భయం వీడాలని ప్రముఖ వైద్యురాలు నవ్యశ్రీ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు యవ్వన దశలో వచ్చే వివిధ సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యురాలు నవ్యశ్రీ మాట్లాడుతూ ఇంటర్ విద్య అభ్యసించే వయస్సులో శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయని, వీటి పట్ల ఆత్మన్యూనతాభావానికి లోను కాకుండా తమ సమస్యలను తల్లిదండ్రులకు, వైద్యులకు తెలిపి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మహిళల పట్ల పెరుగుతున్న అత్యాచారాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సెల్‌ఫోన్‌లను సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలని సూచించారు. అనంతరం శరీరంలో వచ్చే మార్పులపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తోళ్ల గోదామును తొలగించాలని వినతి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న స్క్రాప్ మరియు తోళ్లగోదామును తొలగించాలని షంషీర్‌నగర్ వార్డుకు చెందిన పలువురు ఆర్డీఓ హరికృష్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్క్రాప్ మరియు తోళ్ల గోదాంతో రోడ్డుపైన నడిచే పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్క్రాప్ దుకాణం రోడ్డుపై ఉండడంతో ఇనుప మేకులు పాదాచారులకు, వాహనదారుల టైర్లకు గుచ్చుకొన్న సందర్భాలున్నాయని తెలిపారు. తోళ్ల గోదాము నుండి వచ్చే దుర్వాసనతో కాలనీవాసులు రోగాలపాలు అవుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు పలు సందర్భాల్లో జరిమానాలు విధించిన గోదాం యజమాని తీరు మార్చుకోవడం లేదని తెలిపారు. గోదాం తొలగింపుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

టాలెంట్ వైకల్యానికి అడ్డు కాకూడదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక టాలెంట్ దాగి ఉంటుందని, దానికి వైకల్యం అడ్డుకాకూడదని డీఈఓ ప్రణీత అన్నారు. గురువారం భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కేంద్రం చిన్నారులు చేసిన నృత్యాలు, పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు డీఈఓ బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. చదువులు కూడా బాగా చెబుతున్నారని, నిత్యం తాను కూడా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుందన్నారు. వారిని ప్రోత్సహించే ఏ రంగంలోనైనా రాణిస్తారని, ఉద్యోగ అవకాశాల్లో కూడా వీరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమయ్య, సెక్టోరియల్ అధికారులు కంటే నర్సయ్య, సూజత్ అలీ, కిరణ్, కేంద్రం ఐఈఆర్పీలు కృష్ణవేణి, రాజన్న, గంభీర్, నరేష్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి నిర్ణీత మస్టర్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఒక్క ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పనిసరిగా పూర్తి చేయాలని ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జనవరి 2024 నుండి నవంబర్ వరకు 85 మస్టర్ల కంటే తక్కువ హాజరు నమోదు చేసిన కార్మికులకు ఎస్ఆర్పీ 3,3ఏ గని కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరంలో మిగిలిన డిసెంబర్ నెలలో చేసే మస్టర్లను గమనించడం జరుగుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కంపెనీ క్వార్టర్స్, విద్యుత్, మెడికల్ ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులను కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్యూటీ చేయటం వల్ల కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. ఇప్పటికైనా ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ మహేందర్, సంక్షేమ అధికారి ఎస్ఎండీ గౌస్ పాషా, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి పాల్గొన్నారు.

హెడ్ కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మండలంలోని బలగల గ్రామంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్సియల్ గురుకుల బాలుర పాఠశాల-2లో ఖాళీగా ఉన్న రెండు హెడ్‌కుక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షగుఫ్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంటలు చేయడంలో నైపుణ్యం ఉన్న మైనార్టీ ముస్లిం మహిళలు లేదా పురుషులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి కలిగిన వారు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

బీజేపీ, బీఆర్ఎస్‌కు షాక్..!

- హస్తం గూటికి సోయం బాపురావు, ఆత్రం సక్కు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ, బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. సీనియర్ నాయకులు ఆ పార్టీలను వీడారు. బీజేపీ మాజీ ఎంపీ సోయం బాపురావు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆ పార్టీలకు రాజీనామా చేసి హస్తం గూటికి చేరారు. గురువారం సాయంత్రం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాదులో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. బీజేపీ నుంచి 2019 నుంచి 2024 వరకు సోయం బాపురావు ఎంపీగా పని చేశారు. గతంలో బోథ్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయన బీజేపీలో చేరి ఎంపీగా సేవలందించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ అధిష్టానం సోయంకు టికెట్ నిరాకరించింది. ఈయనకు బదులు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఎంపీ గోడం నగేష్‌కు టికెట్ కేటాయించడం ఎన్నికల్లో ఆయన విజయం సాధించడం జరిగిపోయింది. తనకు టికెట్ రాకపోవడంలో కొందరి నాయకుల హస్తం ఉందని మనస్తాపం చెందిన సోయం బాపురావు ఎన్నికల నాటి నుంచి బీజేపీకి దూరంగా ఉంటూ వచ్చారు. అప్పట్లో కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరిగినా.. కార్యరూపం దాల్చలేదు. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో సస్పెన్షన్‌కు తెరపడింది. ఇక 2018 నుంచి 2023 వరకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా చేసిన ఆత్రం సక్కుకు బీఆర్ఎస్ కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వలేదు. ఈయన స్థానంలో కోవ లక్ష్మీకి టికెట్ కేటాయించింది. ఆత్రం సక్కును ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీగా బరిలోకి దింపింది. కానీ ఓటమి చెందడంతో నిరాశ చెందిన సక్కు కొన్ని రోజుల నుంచి ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. తాజాగా మళ్లీ తిరిగి హస్తం గూటికి చేరుకున్నారు. వీరి వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ పటేల్ ఉన్నారు.



విద్యార్థుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం



తాండూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని మర్చిపోయిందని టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ ఆరోపించారు. సంఘం నాయకులతో కలిసి పూసాల ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే గురుకులం ముందు నిరసన చేపట్టారు. విద్యార్థి నాయకులను యాజమాన్యం లోనికి అనుమతించలేదు. దీంతో పాఠశాల ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు వచ్చామని, పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలిపారు. పాఠశాలలో సౌకర్యాలు సరిగా లేక ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 48 మంది విద్యార్థులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కెసిఆర్ పాలనలో 1000కు పైగా గురుకులాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కలిపిస్తే కాంగ్రెస్ ప్రజా పాలనలో గురుకుల విద్య భ్రష్టు పట్టిపోయిందన్నారు. చలికాలంలో విద్యార్థులకు దుప్పట్లను సమకూర్చలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికైనా గురుకుల పాఠశాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్, విద్యార్థి సంఘాల నాయకులు చెన్నామల్ల చైతన్య, ఖమ్మం చింటు, మండల అధ్యక్షులు శ్రీకాంత్, మండల నాయకులు సారయ్య, మోహన్, అరుణ్, సాయి, లతీఫ్, రాకేష్, జగన్, వెంకటేష్, లడ్డు, షారుఖ్, ముసవీర్, సోఫియన్ పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాలకు ప్రత్యేక నిధులు : ఆడే గజేందర్

నవతెలంగాణ-ఇచ్చోడ

ఏజెన్సీ గ్రామాలకు ప్రత్యేక నిధులపై ముఖ్యమంత్రి ప్రకటన చేయడం గొప్ప విషయమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక వసతులు కల్పనకు ప్రతిపాదనలు పంపాలని సీఎం కార్యాలయం కోరినట్టు తెలిపారు. ఐటీడీఏల బలోపేతంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతులతో పాటు ఆదివాసి గిరిజన ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించే విధంగా, సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయి వారికి చేరే విధంగా ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఉంటుందని, సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడే విధంగా, జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం అన్ని రకాల చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిముద్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కొత్తూరు లక్ష్మణ్, మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ముస్తఫా, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.



పుట్టినరోజు వేళ జర్నలిస్టుల రక్తదానం



ఆదిలాబాద్‌టౌన్ : పుట్టినరోజును పురస్కరించుకుని ఓ జర్నలిస్ట్ రక్తదానం చేసి తన సేవా తత్పరతను చాటుకున్నాడు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన జర్నలిస్ట్ గాజరి శ్రీకాంత్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో గురువారం రక్తదానం చేశాడు. అలాగే తోటి మీడియా మిత్రులు అరుణ్‌రెడ్డి, కలల అభిలాష్, రాము సైతం తనతో పాటు రక్తదానం చేశారు. ప్రతి సంవత్సరం పుట్టినరోజు నాడు రక్తదానం చేయడం ఆనవాయితీగా వస్తుందని శ్రీకాంత్ తెలిపాడు. పుట్టినరోజు వేళ రక్తదానం చేయడం సంతోషంగా ఉందని, రక్తదానం చేయడం ఇది ఐదోసారని పేర్కొన్నారు. అన్ని దానాలలో ప్రధానమైన దానం రక్తదానమని తెలిపాడు. కార్యక్రమంలో మీడియా మిత్రులు సుధాకర్, కిరణ్‌రెడ్డి, నరేష్, వెంకటేష్, మహేష్, ప్రవీణ్, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాలపై కలెక్టర్ రివ్యూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తు సలహాలు, సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాఠశాలపై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల విద్యార్థులు తయారు చేసిన చార్ట్‌లు, పలు అంశాలపై రూపొందించిన చిత్రాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. కలెక్టర్ తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే వారంతో నెల రోజులు పూర్తి అవుతుందని తెలిపారు. మరో నెల రోజు చేపట్టే కార్యక్రమాలపై ప్రణాళికలు చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం ప్రార్థన, సాయంత్రం చివరి పీరియడ్‌లో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో విద్యార్థు ఆరోగ్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. కానీ ప్రతి విద్యార్థిని టచ్ చేయాలంటే తరగతుల వారీగా గ్రూప్‌లను తయారు చేస్తే సులభమవుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ఆయా శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతుబజార్ వద్ద దుకాణాల తొలగింపు

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని వినాయక్ చౌక్‌లో రైతు బజార్‌లో నిత్యం కూరగాయల కోసం వచ్చే వారికి పార్కింగ్ సమస్య ఎదురవుతుండడంతో మార్కెటింగ్ అధికారులు రైతుబజార్ లోపల వరుస క్రమంలో లేకుండా ఉన్న దుకాణాలను పోలీసులు, మున్సిపల్ అధికారుల సాయంతో తొలగించారు. మార్కెటింగ్ అధికారి గజానంద్ ఆధ్వర్యంలో మార్కెట్ బయట దుకాణాలు వేసిన వారికి లోపల స్థలం చూపించి అక్కడ దుకాణాలు పెట్టుకునేలా అవకాశం కల్పించారు. వన్‌టౌన్ సీఐ సునీల్, ఎస్సై అశోక్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులు వ్యాపారస్తులు, రైతులతో మాట్లాడి ట్రాఫిక్, పార్కింగ్‌కు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అధికారి గజానంద్ మాట్లాడుతూ రైతు బజారుకు వచ్చే వినియోగదారులకు పార్కింగ్ సమస్య తీవ్రమైందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వరుస క్రమంలో లేని దుకాణాలకు లోపల స్థలం కేటాయించామన్నారు. పద్దతి ప్రకారంలో డ్వాక్రా సభ్యులు, వ్యాపారస్తులు, రైతులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలని సూచించారు.

2
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | డిసెంబర్ 06, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేను కలిసిన వీఆర్‌ఏ జేఏసీ సభ్యులు

నవతెలంగాణ-నేరడిగొండ

ఆదిలాబాద్ జిల్లా వీఆర్‌ఏ జేఏసీ సభ్యులు గురువారం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఓ నెం. 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇప్పించుట గురించి అసెంబ్లీలో ప్రస్తావించి, తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించి, కచ్చితంగా అసెంబ్లీలో ప్రస్తావిస్తాని అదేవిధంగా తమ పార్టీ నాయకత్వానితో కూడా చర్చించి న్యాయం జరిగేలా అసెంబ్లీలో గళమెత్తుతామని అన్నారు.



నిర్భయంగా పరీక్షలు రాసేలా చూడాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా హాజరయ్యేలా చూడాలని ఇంటర్మీడియట్ పర్యవేక్షణ అధికారి పరశురాం సూచించారు. ఆయన పట్టణంలోని ఇంటర్మీడియట్ మైనార్టీ కళాశాలను సందర్శించారు. కళాశాలలో అడ్మిషన్లు, తరగతుల నిర్వాహణ వివరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వార్షిక పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా ఉపాధ్యాయులు సరైన ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యం, కోఆర్డినేటర్ సలీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

- ఆర్జీయూకేటీని సందర్శించిన విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి



నవతెలంగాణ-ముధోల్

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యమని విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా పర్యటనలో భాగంగా ఆర్జీయూకేటీ, బాసరను సందర్శించారు. క్యాంపస్‌కు చేరుకున్న ఆయన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ స్వాగతం పలికారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, భోజన శాల, వసతి గృహాల నిర్వహణ విద్యార్థులకు అందిస్తున్న సేవలు, విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వీసీతో కలిసి భోజనశాలను, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో ఆడిటోరియం, కబడ్డీ కోర్టు, టెన్నిస్, ఖోఖో క్రీడా సంబంధిత పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్జీయూకేటీలో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఉత్తమ సంస్థగా ఎదిగేందుకు అవసరమైన చర్యలను చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తామని, ప్రభుత్వపరంగా ప్రీ ప్రైమరీ నుండి ఉన్నత విద్య వరకు ప్రతిష్టాత్మకమైన పాలసీ తీసుకురాబోతున్నట్లు చెప్పారు. కార్యక్రమ అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్‌టి మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్రన్, ఏఓ రణధీర సాగి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

వివిధ పాఠశాలలను సందర్శించిన చైర్మెన్...

ముధోల్, బాసరలోని ప్రభుత్వ పాఠశాలలను విద్యా కమీషన్ చైర్మెన్ ఆకునూరి మురళి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించారు. బాసర మండలంలోని బిద్రెల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ముధోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు, తరగతి గదులను తనిఖీ చేసి, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న భోజనానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు.

వంటకు ప్రభుత్వ నియమాల ప్రకారం నాణ్యమైన సరుకులను, కూరగాయలను మాత్రమే వినియోగించాలని తెలిపారు. భోజనశాల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అంబాజీ, మోహన్ సింగ్, శ్రీనివాస్, ముధోల్ మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు పవనచంద్ర, శ్రీకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-కడెం

ఇటీవల యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఎన్నికైన రెంకల శ్రీనివాస్ యాదవ్‌ను గురువారం మండల కేంద్రంలోని స్థానిక హరిత రిసార్ట్‌లో కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో శాలువా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెంకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. తనపై నమ్మకంతో యువజన మండలాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు గాను కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసి, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, నచ్చన్‌ఎల్లాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న, లింగాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల బాలవ్వ లచ్చన్న, మైనార్టీ అధ్యక్షులు బబ్లు, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్ల పెల్లి రమేష్, రహీం, రాజ నర్సయ్య, ముస్కు రాజు, ధర్మయ్య, చెవుటి మహేష్, పాండ్వాపూర్, లక్ష్మీపూర్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం కప్ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

సీఎం కప్ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సీఎం కప్-2024ను ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ముప్పై ఆరు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి కావడంతో ఈ మేరకు పురస్కరించుకుని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10 నుంచి జనవరి 02 వరకు గ్రామ, పట్టణ, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో 10, 11, 12 తేదీల్లో సీఎం కప్ పోటీల నిర్వహణ గూర్చి, ఏర్పాట్లు ఇతర అంశాలపై చర్చించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎంకప్2024.తెలంగాణగావ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందిని నియమించాలి

- బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పులిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గత నాలుగు నెలల నుంచి సిబ్బంది లేక గ్రామంలోని పిల్లలు ఇబ్బందికి గురవుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ గతంలో పులిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసిన టీచర్ పదోన్నతిపై ఇచ్చోడ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. దీంతో పులిమడుగు అంగన్‌వాడీ టీచర్ స్థానం ఖాళీ కావడంతో అక్కడ ప్రభుత్వం ఎవరిని నియమించలేదని పీఓకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఆయా కూడా లేకపోవడం వల్ల కేంద్రానికి తాళం వేశారని తెలిపారు. సిబ్బందిని నియమించి చిన్నారుల విద్యాభ్యాసానికి తోడ్పడగలరని కోరారు. అదేవిధంగా ఆందోలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నందున అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు. దీనికి పీఓ ఖుష్బు గుప్తా సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబా శ్యామ్ టైగర్, క్రాంతి, సాజిద్, సాయి, తేజ పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి సారూ..



నవతెలంగాణ-నేరడిగొండ

తమ పిల్లలు పుట్టుతోనే మూగ, చెవిటి వికలాంగత్వంతో పుట్టారని, ఒక్కొక్కరికి ప్రస్తుతం 8, 9 సంవత్సరాలు ఉన్నాయని, సదరం సర్టిఫికెట్ ఉందని, కాని ఇప్పటికి వరకు తమ పిల్లలకు ఫించన్ రావడంలేదని మండల కేంద్రానికి చెందిన దేవల్ల లక్ష్మిగంగన్న దంపతులు గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి తమ గోడును వినిపించారు. తమకు నలుగురు సంతానమని, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారందరూ మూగ, చెవిటి వికలాంగత్వంతో పుట్టారని అన్నారు. తమ సమస్యను అధికారులకు విన్నవించినప్పటికీ పింఛన్ మంజూరు కాలేదన్నారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయామన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, కుటుంబ పెద్ద గంగన్నతో పాటు, గ్రామస్తులు గాజుల సతీష్, సయ్యద్ ఖదీర్, బెక్కెం ఉశన్న ఉన్నారు.

ఇచ్చోడ గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఇచ్చోడ

ఇచ్చోడ పట్టణ గ్రామాభివృద్ధి కమిటీని ఆ గ్రామ ప్రజలందరికీ కలిసి గురువారం స్థానిక షార్ప్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామాభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులుగా అన్నెల లక్ష్మణ్, అధ్యక్షులుగా పెరుమండ్ల నారాయణ, ఉపాధ్యక్షులుగా గుమ్మడి భీమిరెడ్డి, అబ్దుల్ సాబీర్, జల్దెజాకు, గొలుసుకుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రేణిగుంట సురేష్, కోశాధికారిగా వేణుగోపాలచారి, ఉప కార్యదర్శిగా ధరావత్ నరేందర్, చింతల స్వామి, హైద రాజేశ్వర్, పెంటన్నతో పాటుగా మరో 25 మందిని వివిధ భాగాల్లో ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. వీడీసీ నిబంధనలను పాటిస్తామన్నారు. గ్రామంలోని వివిధ సామాజిక సంఘాల నాయకులు వీడీసీ నాయకులు సన్మానించారు. ఈ ఎన్నికల్లో ఇచ్చోడలోని అన్ని వర్గాల ప్రధాన నాయకులు, ఆయా కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి నాలుగు సంవత్సరాల జైలు, రూ.5వేల జరిమానా

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి నాలుగు సంవత్సరాల జైలు రూ.5వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కర్ణ కుమార్ గురువారం తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డ్యాంగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లుల చంద్రశేఖర్ ఓ మైనర్ బాలికపై 31మార్చి 2021లో అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. కాగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిర్మల్ రూరల్ ఎస్సై సోమ సుమన్ కేసు నమోదు చేయగా, అప్పటి డీఎస్పీ డి.ఉపేందర్ కేసు దర్యాప్తు చేసి, నేరస్తునిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో స్పెషల్ పీపీ వై.విశ్వాస్‌రెడ్డి పదిమంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరస్తునిపై నేరం రుజువైనందున నేరస్తునికి పోక్సో కోర్టు న్యాయమూర్తి నేరస్తునికి నాలుగు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన ప్రాసిక్యూషన్ అధికారి విశ్వాస్‌రెడ్డి, అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారులు ఉపేందర్‌రెడ్డి, అదనపు ఎస్పీ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కిష్టు, ప్రభాకర్ హెడ్ కానిస్టేబుల్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాదమని తెలిసి ప్రధాన కూడలిలో అమ్మకాలు

- నియంత్రణ చర్యలు చేపట్టని అధికారులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని తెలంగాణచౌక్‌లో రహదారిపై కూర్చొని కూరగాయలు అమ్మడం ప్రమాదాన్ని సూచిస్తోంది. ఎప్పుడు వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ఈ కూడలి, ఇరుకుగా ఉంటుంది. నిర్మల్, జగిత్యాల వైపు వెళ్లే భారీ వాహనాలు ఈ కూడలి నుంచే పోతాయి. బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలు, పాదచారులతో నిత్యం రద్దీతో ఉండే ఈ రహదారిపై కూరగాయలు అమ్మడాన్ని పట్టణ ప్రజలు తప్పుబడుతున్నారు. ఏదైనా వాహనం పొరపాటున అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మూడురోజుల కింద రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్మే వారిపైకి లారీ దూసుకెళ్లి పలువురు దుర్మరణం చెందిన సంఘటన తెలిసిందే. అయినా కూరగాయలు అమ్మే వారికి వాహనాల రద్దీ అధికంగా ఉండేచోట కూర్చొని అమ్మకూడదనే ఆలోచన రావడంలేదు. ప్రమాదమని తెలిసి కూరగాయలు అమ్ముకోవడం కోసం రద్దీ ప్రాంతంలో కూర్చోవడం ఏమాత్రం మంచిదికాదు.

అధికారులు పట్టించుకోవాలి...

వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే తెలంగాణచౌక్ రహదారిపై అమ్ముతున్న వారికి మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే ఎదురయ్యే నష్టాన్ని వివరించి, వారిని మరోచోట అమ్ముకునేలా ఏర్పాట్లు చేయాలి. పోనీలే అనుకొని నిర్లక్ష్యంగా ఉంటే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రం పరోక్షంగా బాధ్యులుగా మారినవారవుతారు. ఎలాంటి నష్టం జరగక ముందే మున్సిపల్ అధికారులు తేరుకొని చర్యలు తీసుకోవాలి. అలాగే పోలీసు అధికారులు సైతం దృష్టి సారించి వాహన చోదకులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్రంలోని ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం వెంటనే స్పెషల్ డీఎస్సీని ప్రకటించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్, జిల్లా రాయిసెంటర్ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9న ఆదివాసుల పోరాట దినోత్సవాన్ని ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలోని ఆదివాసీ గిరిజనులందరూ ప్రజా ప్రతినిధులు తరలిరావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంలో పొందుపరిచిన ఆదివాసీ హక్కులు, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన జరుగుతుందని తెలిపారు. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టి ఆదివాసుల అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఇంద్రవెల్లిలో ఆదివాసీ పోరాట దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. గత ప్రభుత్వం 11 కులాలను ఎస్సీ జాబితాలో కలుపుతూ చేసిన తీర్మాణాన్ని రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆదివాసులకు కల్పించాలన్నారు. జైనూర్ సంఘటనలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా మహిళా నాయకురాలు పెందూర్ పుష్పరాణి, సార్మేడి సలాం దేవ్‌రావు, త్రియంబక్, కొట్నాక్ బారిక్‌రావు, పురక చిత్రు పాల్గొన్నారు.



నూనె గింజ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

నవతెలంగాణ-పెంబి

మండలంలో మంచి సారవంతమైన భూములు ఉన్నాయని, ఇక్కడి రైతులు నూనె గింజ పంటల సాగుపై దృష్టి సారించాలని సేవ స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మ్యాక్స్ సహకార సంఘంలో వ్యవసాయశాఖ, భారత నూనెగింజల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రబీలో సాగు చేయదగిన నూనె గింజ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎప్పటికప్పుడు పంటల సాగు విధానంలో మెళకువలు నేర్చుకోవాలని తెలియజేశారు. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇచ్చే పంటలు పండిచాలని ముఖ్యంగా నూనె గింజల సాగు, చేసి విలువ జోడింపు చేయడం వల్ల ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలియజేశారు. వివిధ పంటల్లో ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. అలాగే రైతులు విధిగా తమ నేల పరీక్షలు జరిపి పోషక లోపాలు సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మినీ సాయిల్ కిట్‌తో రైతు స్థాయిలో ప్రధాన పోషకాలు నత్రజని, పోటాష్, భాస్వరం, ఉదజని స్థాయి, పరీక్ష చేసే విధానంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు నేలను సారవంతంగా చేపట్టాల్సిన చర్యలు అనగా పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియ దున్నడం, జీవన ఎరువులు, పంట మార్పిడి, చెరువు మట్టి వంటివి, రైతులు తమ నేల సారవంతం చేయుటకు విధిగా పాటించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా రైతుల అందిస్తున్న సేవలు వివరిస్తూ నూనె గింజ పంటైన నువ్వుల సాగుపై మాట్లాడటం జరిగింది. అలాగే ఈ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ వారు అభివృద్ధి చేసిన రాపిడ్ సాయిల్ టెస్ట్ కిట్ ద్వారా మట్టి పరీక్ష చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఖానాపూర్ డివిజన్ ఏడీ సుజాత, నిర్మల్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏఓ భాస్కర్, మండల వ్యవసాయ అధికారి నవీన్, ఏఈఓలు రాజ్ కుమార్, లక్ష్మణ్, పెంబి మ్యాక్స్ వైస్ చైర్మెన్ రాజేందర్, మండల రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

నవతెలంగాణ-దహెగాం



వరి కొయ్యలను కాల్చొద్దని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కొంచవెల్లి, లగ్గాం తదితర గ్రామాలలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, విపరీతమైన వేడితో భూమి సారం దెబ్బతింటుందన్నారు. మనుషులకు శ్వాసకోశ సమస్యలు వస్తాయని, పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని పేర్కొన్నారు. వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఉన్నారు.

108లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రోగులకు అత్యావసర వైద్య సేవలందిస్తున్న 108 వాహనంలో మహిళ ప్రసవించింది. వివరాల్లోకి వెళితే మండలంలోని సాలిగూడ గ్రామానికి చెందిన శ్యామ్ రావు భార్య వందనకు పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. వాహనంలో గర్భిణీకి నొప్పులు పెరగడంతో సీనియర్ ఈఎంటీ రజనీకాంత్, శిక్షణ ఈఎంటీ ప్రవీణ్ యాదవ్, పైలెట్ నాగార్జున గర్భిణీకి ప్రసవం చేశారు. బిడ్డ తల్లి క్షేమంగా ఉండడంతో 108 సిబ్బందిని పలువురు అభినందించారు. అదే వాహనంలో ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్ష చేయించారు. కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నిషేధిత గంజాయి స్వాధీనం

- ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ నిషేధిత గంజాయిని టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. గురువారం టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సవాతి గ్రామంలో గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు సవాతి గ్రామంలోని ఒక ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన షిండే శ్యాంరావు ఇంట్లో తనిఖీ చేపట్టగా ప్రభుత్వ నిషేధిత గంజాయి 1.6 కేజీ లభించింది. సుమారు దాని విలువ రూ. 40,000 ఉంటుందన్నారు. సదరు నిందితుడు మహారాష్ట్ర నుండి గంజాయిని తెచ్చి వాంకిడి, ఆసిఫాబాద్, కరీంనగర్‌లోని పరిసర గ్రామాల ప్రజలకు విక్రయిస్తున్నట్లు, గంజాయి, నిందితున్ని వాంకిడి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ. వెంకటేష్, పీసీలు మధు, రమేష్, దేవేందర్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల నుండి రైతులను కాపాడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దళారుల నుండి పత్తి, ధాన్యం రైతులను కాపాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశాన రాజన్న కోరారు. ఆసిఫాబాద్ డిఆర్ఓ లోకేశ్వర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పత్తి పంట రైతుల చేతికి వచ్చిన సమయంలో జిల్లాలో అమాయక రైతులను దళారులు పత్తి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను ముంచుతున్నారన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని జిల్లాలో విచ్చలవిడిగా ఎలాంటి అనుమతులు లేకుండా పత్తి కాంటాలు పెట్టి దాదాపుగా క్వింటాలుకు రూ.500 నుండి రూ.700 తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో తునికల కొలతల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన రైతులకు నష్టం జరుగుతుందని, పత్తి కాంటాలలో సైతం రైతులను మోసం చేస్తున్నారన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తనిఖీలు లేకపోవడం కూడా రైతులకు శాపంగా మారిందని, దీన్ని ఆసరా చేసుకొని దళారులు రెచ్చిపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను దళారుల బారి నుండి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, రాజేందర్, కార్తీక్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం అధికారి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితాన్ని మాదకద్రవ్యాలు అస్తవ్యస్తం చేస్తాయన్నారు. విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు అలవాటయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వాటిని దూరం చేసుకునేందుకు నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. విద్యార్థులు వారికి సంబంధించిన వారు ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే సాయం కోసం 1908 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712671111ను సంప్రదించాలని తెలిపారు. అధ్యాపకుడు సతీష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మార్పు మొదలు కావాలన్నారు. ప్రకాష్ మాట్లాడుతూ వ్యక్తిగత నియంత్రణ తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం అధ్యాపక బృందంతో కలిసి మాదకద్రవ్యాల నియంత్రణ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులి సంచారం వదంతులు ప్రచురించొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో పులుల సంచారం నేపథ్యంలో స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేయాలని వదంతులను ప్రచురించకూడదని జిల్లా అటవిశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తెలిపారు. తప్పుడు పుకార్లు, వార్తలు వ్యాప్తి చేయడం జరుగుతున్నట్టు గమనించడం జరుగుతుందన్నారు. తప్పుడు ప్రచారంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. భయాందోళన పస్థితులు సృష్టించడం సరికాదన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన సమాచారాన్ని ప్రచురించే ముందు అటవీ శాఖ అధికారులతో ధ్రువీకరణ చేసుకోవాలని కోరారు. తప్పుడు వార్తలు ప్రచారం చేయడం కాకుండా సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేస్తే వారిపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 9 నుండి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రాలను వికలత్వ పరీక్ష చేయించుకుని స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత సకాలంలో సదరం శిబిరానికి హాజరుకావాలని తెలిపారు. ఈ నెల 9న మూగ, చెవిటి, 10న కంటి చూపు, 23న మానసిక వైకల్యం, 24న ఎముకలు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థులు సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆర్టీసీతో ప్రజలకు నాణ్యమైన సేవలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



ఆర్టీసీ ఉద్యోగులతో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీతో ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలకు డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అనేక రకాలైన రవాణ సేవలు ప్రజలకు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది మహిళా మనులు తమ ఆరోగ్య అవసరాలకు, ఇతర దైనందిన అవసరాలకు ఆర్టీసీ ద్వారా సేవలను పొందుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ప్రతిష్టాత్మక పథకం ఆర్టీసీలో దిగ్విజయంగా అమలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న సేవలను కొనియాడారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా వేల మంది మహిళామణులు వారి గమ్యస్థానాన్ని ఉచితంగా చేరుకుంటున్నారన్నారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో గత సంవత్సర కాలంగా ప్రయాణిస్తున్న మహిళ ఉద్యోగులు, ప్రయాణికులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేకల మందపై అటవీ జంతువుల దాడి



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రాన్ వెల్లి గ్రామ శివారులో గల ప్రాణహిత నది పరివాహక ప్రాంతం కుర్తపై మేకల మందపై అటవీ జంతువులు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. మేకల కాపరులు, బాధితులు దండిగే బాపు, బీంకరి శంకర్, రాగుండి శంకర్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి 10 గంటల సమయంలో మేకల మందుకు దూరంగా చలి మంట వేసుకొని ఉన్నారు. ఒక్క సారిగా అటవీ జంతువులు మేకల మందపై దాడి చేయడంతో మేకలు అరుపులు చేస్తూ బయటకు పరుగుల పెట్టాయి. పది రోజులుగా కాగజ్‌నగర్ అటవీ శాఖ పరిధిలో పులి దాడి చేసి ఒకరిని చంపి, మరొకరిపై దాడి చేసిందని, ఇలా వార్తలు వస్తు ఉండటంతో మేకల మందపై పులి దాడి చేస్తుందని భయంతో పరిపోయారు. రాత్రి అంతా మేకల అరుపులు రాత్రి తెల్లవారే వరకు ఉండటంతో నిద్ర లేకుండా భయంతోనే ఉన్నారు. తెల్లవారిసరికి చూస్తే కుప్పలు, కుప్పలుగా మేకులు చెల్ల చెదురయ్యాయి ఉన్నాయి. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీఓ ప్రభాకర్ సిబ్బందితో కలిసి అక్కడి చేరకొని మృతి చెందిన మేకలను పరిశీలించి చుట్టు పక్కల ఉన్న జంతువుల పాదముద్రలను కొలతలు తీసుకున్నారు. అదే విధంగా కౌటాల సీఐ ముత్యం రమేష్ అక్కడి చెరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఖర్జెల్లీ డిప్యూటి రేంజర్ హైమవతిని వివరణ కోరగా రాన్‌వెల్లి సమీపంలోని ప్రాణహిత నది వద్దకే ఖర్జెల్లీ అటవీశాఖ పరిధి అని, మేకలను హతమార్చింది పులి, చిరుత, లాంటి అటవీ జంతువులు కాదని, అవి దాడి చేసిన తీరును పరిశీలించడంతో అటవీ రేస్ కుక్కలవి ఉంటాయన్నారు. మేకలను పులి చంపిన ఏలాంటి నష్టపరిహారం ఉండదని తెలిపారు.

సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి



నవతెలంగాణ-దహెగాం

సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి, రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏఈఓ లావణ్య అన్నారు. గురువారం మండలంలోని బీబ్రా రైతు వేదికలో ప్రపంచ మృత్తిక (నేల)దినోత్సవం సందర్భంగా రైతులకు భూసారం పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల సంరక్షణ, నేల ప్రాధాన్యత గురించి తెలియజేశారు. భూసారా పరీక్ష కోసం మట్టి నమూనాలు సేకరించే విధానం గురించి, భూసార పరీక్ష ద్వారా కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కౌటాల : ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు వ్యవసాయ అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రేమలత సమక్షంలో రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. మట్టి నమూనాలు పొలం నుంచి ఎలా సేకరించాలి, ఆ నమూనాను ఎలా తయారు చేయాలని రైతులకు వివరించారు. మట్టి పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువుల మోతాదు సిఫారసు చేయొచ్చని వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పెందూర్ ప్రేమలత, వ్యవసాయ విస్తరణ అధికారులు సీహెచ్ అంజన్న, ఘన్ శ్యామ్, కవిత, కల్పన, ఆదిత్య వర్ధన్, బి.సిద్దార్థ, రష్మిత, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మనీషా అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి సంరక్షణ పద్ధతులను పాటించాలని, భూమి సంరక్షణతో పాటు సుస్థిర వ్యవసాయ పద్ధతులను మట్టిలో పోషకాలను లభ్యతను, మెరుగుపరిచే పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని శ్రీవిద్య రైతులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ గ్యారంటీల గారడి : ఎమ్మెల్యే పాల్వాయి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాంగ్రెస్ గ్యారంటీల గారడి ఆరు అబద్ధాలు, అరవై ఆరు మోసాలపై కాగజ్‌నగర్ నుండి మండల కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రవీంద్ర నగర్-1 గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అంకెల గారడీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఆరు అబద్ధాలు, అరవై ఆరు మోసాలపై చార్జి సీటు దాఖలు చేసి విడుదల చేశామని అన్నారు. ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చి సంవత్సరం పూర్తయిన, వరి ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఎన్నికల తర్వాత ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం, సన్న వడ్లకే మాత్రమే బోనస్ ఇస్తామని చెప్తున్నారని తెలిపారు. రెండు లక్షలోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తానని చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, నాయకులు మల్లయ్య, సుశీల మండల్, సుధాకర్, కొప్పుల శంకర్, మురళి, తుకారం ఉన్నారు.

భీమన్న క్రీడా మైదానాన్ని పరిశీలించిన జీఎం



నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని శ్రీ భీమన్న క్రీడా మైదానాన్ని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలో భాగంగా కంపెనీ స్థాయి క్రికెట్ పోటీల కోసం మైదానంలో నిర్మిస్తున్న క్రికెట్ పిచ్ పనులను తనిఖీ చేశారు. ఆరు రీజియన్‌ల పరిధి క్రీడాకారుల కోసం ఏర్పాట్లు బాగుండాలని సివిల్ అధికారులకు సూచించారు. రాత్రి కూడా క్రీడాకారులు సాధన చేసేందుకు లైట్లు, సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, సివిల్ (ఎస్ఈ) మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ పాల్గొన్నారు.

సింగరేణి డే ఏర్పాట్లపై సమీక్ష

జీఎం కార్యాలయం కాన్ఫరెన్సు హాల్‌లో జీఎం ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న సింగరేణి డే ఏర్పాట్లపై అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీ భీమన్న మైదానంలో లైటింగ్, బ్యాండ్, సౌండ్ సిస్టం, కళా బృందాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జీఎం సూచించారు. హరిత గృహాల ఎంపిక, దీపాలంకరణ పోటీల నిర్వహణపై సూచనలు చేశారు. పిల్లల ఆట వస్తువులు, గృహోపకరణాలు, తినుబండారాలు వంటి స్టాల్‌ల ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమం ఎస్ఓటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావ్ జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఎస్ఈ (సివిల్) మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారు

- రాష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్



నవతెలంగాణ-కౌటాల

ఏడాది పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని రాష్ట్ర ట్రైబల్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. గురువారం మండలంలోని జగదాంబ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవ సభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ఏడాది కాలంలోనే ఇందిరమ్మ పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం రేవంత్ రెడ్డి వెనుకడుగు వేయకుండా ప్రజా పాలన సాగిస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ మరింత మేలు చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమానత్వంతో చూడడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు. సమగ్ర సర్వేతో రాష్ట్ర ప్రజల స్థితిగతులు తెలుస్తాయని, దీనిద్వారా ప్రజలకు ఏ రీతిలో మేలు చేయగలమని సీఎం, సహా మంత్రులు ఆలోచన చేస్తుందని చెప్పారు. ప్రతిపక్షాలు చేసే నిరసనలు, ఆరోపణలు కనీసం ప్రజలు గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రజా పాలన విజయోత్సవాలను చూసి ఓర్వడం లేదన్నారు. ఈ సందర్భంగా తమను రెగ్యులర్ చేసేలా చూడాలని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వొకేషనల్ లెక్చరర్లు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ అజ్మీరా శ్యామ్‌నాయక్, జడ్పీ మాజీ చైర్మన్ సిడం గణపతి, పీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య, నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేయొద్దు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



పులి సంచారంపై తప్పుడు ప్రచారాలు చేయొద్దని సిర్పూర్ రేంజ్ అటవీ క్షేత్ర అధికారి ఇక్బాల్ అన్నారు. కొంతమంది వ్యక్తులు తప్పుడు పుకార్లు, వార్తలు వ్యాప్తి చేస్తున్నారని, తప్పుడు ప్రచారం చేయడం వలన ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నట్లు తెలిపారు. పులి సంచారంపై ఎలాంటి తప్పుడు సమాచారం సామాజిక మధ్యమాలు, ఇతర వాటిల్లో పెట్టితే చర్యలు తీసుకుంటామన్నారు. పులి కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. పొలాలకు వెళ్లే వారు అటవీ శాఖ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మహారాష్ట్రకు బొలెరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టుకున్నట్టు ఎస్ఐ కమలాకర్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం గురువారం తెల్లవారుజామున సమాచారం మేరకు హుడికిలి చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నారు. సిర్పూర్ నుండి మహారాష్ట్ర వైపు బొలెరో వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఇందులో సుమారు 30 క్వింటాళ్ళ రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. బియ్యం విలువ సుమారు రూ.1 లక్ష 8 వేలు ఉంటుందని, హుడికిలి గ్రామానికి చెందిన కిర్మిరే తరుణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని టేకుమట్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఇన్ఫోసిస్ వారి సహకారంతో బ్యాగులు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాణి తెలిపారు. ఇన్ఫోసిస్ స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్న వంశీ, ఆధిత్య, కృష్ణ చౌరవతో రుద్రభట్ల శ్రీనివాస్, లక్కాకుల సురేందర్ రావు సహకారంతో పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులకు బ్యాగులు సమకూర్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల ద్వార సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

కిష్టంపేట అంగన్‌వాడీ టీచర్ మృతి

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ చల్లూరి శాంత అనారోగ్యంతో మరణించారు. మంచిర్యాల సీడీపీఓ స్వరూప రాణి చల్లూరి శాంత పెద్ద కుమారునికి అంత్యక్రియాలకు ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అందించారు. ఐసీడీఎస్ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు పార్థివ దేహాన్ని సందర్శించి సంతాపాన్ని తెలియజేశారు. తాండూర్ సెక్టర్, మాదారం సూపర్‌వైజర్లు స్వరూప, రమాదేవి, మమత, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రమణ, జిల్లా సహాయ కార్యదర్శి తాగాం రాజారాం, అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, సత్యవతి, విజయలక్ష్మి, లీల రాణి, తిరుమలేశ్వరి, విజయలక్ష్మి, విజయ నివాళులర్పించారు.

రసాయన ఎరువులను తగ్గిస్తే భూసారం పెరుగుతుంది



మందమర్రి : భూ సార పరీక్షపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నవతెలంగాణ-మందమర్రి

ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సండ్రోన్ పల్లి గ్రామం రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన హాజరై భూసార పరీక్ష ప్రాముఖ్యత, నేలలో సేంద్రియ కర్బన్ శాతం పెంపొందించు విదానాలు, భూ పరిరక్షణలో రైతుల చర్యలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షకు మట్టి నమూనా సేకరించే విధానాన్ని ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాణ్యమైన నేలను అందించాలంటే భూసార పరిరక్షణ విధానాలు వాలుకు అడ్డంగా దున్నుట, వరిలో దమ్ము చేయుటకు కేజ్ వీల్స్‌కు బదులుగా రోటావేటర్ వాడుట, పశువుల పేడ నేలకు అందించుట, సేంద్రియ వ్యవసాయ విధానాలు పాటించుట, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్మయి, విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

జైపూర్ : పంటల సాగులో రసాయణ ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవల్సిన అవసరమని వ్యవసాయ అధికారి అత్తె సుధాకర్ అన్నారు. మృతిక నేల (భూమి) దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రైతు వేదికలో రైతులతో సమావేశమయ్యారు. అనంతరం పంట క్షేత్రాలను సందర్శించిన ఆయన నేల కలుషితం కాకుండా కాపాడుకోవడం ద్వార భవిష్యతరాల వారికి స్థిరమైన సహజ వనరుగా కాపాడుకోవడం బాధ్యతగా భావించాలని తెలిపారు. విపరీతమైన రసాయణ ఎరువులు,పురుగుల మందుల పిచికారి, ఇతర రసాయణ ఉత్పాదకాల వాడకంతో నేల స్వభావం పూర్తి మారిపోవు ప్రమాదమున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 22 రకాలైన నేలలు ఉన్నారని వాటిలో నల్ల, ఎర్ర రేగడి, ఇసుక నేలలో అనేకమైన రకాలు ఉన్నట్లు తెలిపారు. నీటి నిలువ సామర్థ్యం, పోషకాల లభ్యత నేల స్వభావాన్ని బట్టి ఉంటుందన్నారు. నేల పొర ఒక ఇంచు ఏర్పడాలంటే కనీసం వంద సంవత్సరాలు అవసరమవుతుందని 60 శాతం బోరుబావులు అట్టడుగు నుండి నీటి తోడటం ద్వార లవణాలు పైకి వచ్చి నేలపై పొరగా ఏర్పడి దిగుబడులు తగ్గడం జరుగుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్, భీమారం, అంకుషాపూర్ శివారు రైతులు పాల్గొన్నారు.



జైపూర్ : రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

తాండూర్ : పకృతి ప్రసాదించిన వనరుల్లో భూమి ఒక సంపదని రసాయనాల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడాలని వ్యవసాయ అధికారి కె. సుష్మ సూచించారు. ప్రపంచ నేల దినోత్సావం సందర్భంగా మండలంలోని కొత్తపల్లి రైతువేదికలో మట్టి పరీక్షల తీరు, భూమిని సారవంతం చేసే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నేలను సంరక్షించడంలో భాగంగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట, పల్లిపెసర, జీలుగ విత్తనాలు వేసి నేలను సారవంతం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శంకర్, ధాన్యలక్ష్మి, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

జన్నారం : ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని



తాండూర్ : భూ సారం గురించి వివరిస్తున్న ఏఓ సుష్మ

పొనకల్ రైతు వేదికలో క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. అధిక రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకంతో నేల జీవరాశులు నశించిపోతున్నాయన్నారు. పచ్చిరొట్ట పంటలు (జీలుగా, జనము, పిల్లి పెసర) వాడకం ద్వారా నేల సారవంతతను పెంచుకోవచ్చునిసచించారు. కార్యక్రమంలో జన్నారం క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ముత్యంపల్లి, ధర్మరావుపేట రైతు వేదికలలో ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవాన్ని పురస్కరించుకొని నేల ప్రాముఖ్యత, సమీకృత పోషక యాజమాన్యం, మట్టి నమూనాల సేకరణపై మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ అవగాహన కల్పించారు. నేల కలుషితం కాకుండా భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, స్థిరమైన సజీవ వనరుగా అందించడం మన బాధ్యతని, నేల కలుషితం కాకుండా సహజ సూక్ష్మజీవుల పరిరక్షణ కోసం, నేల జీవ శక్తిని కొనసాగించాలన్నారు. విపరీతమైన రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇతర రసాయన ఉత్పాదకాల వాడకంతో నేల స్వభావమే మారిపోతోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు నాగ దిప్తి, రమ్య, రైతులు పాల్గొన్నారు.



కాసిపేట : రైతు వేదికలో భూ సారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్టీసీని కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ ఆర్టీసీకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఆర్టీసీనీ కాపాడుకుంటామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. గురువారం ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం కల్పించి మహిళలకు ఎంతో ఆర్థిక భరోసా ఇచ్చిందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీ సంస్థ ఆస్తులను అమ్మే వరకు వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలనలో ఆర్టీసీ లాభాల బాట పట్టిందన్నారు. ఒక్క మంచిర్యాల ఆర్టీసీ డిపో రూ.8 కోట్ల లాభాలను ఆర్జించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ యాజమాన్యం, సమిష్టి కృషితో ప్రయాణికులను తమ గమ్యస్థానాలు చేర్చే డ్రైవర్ కండక్టర్‌లను అభినందించారు. మంచిర్యాల జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణంలో కోటి 30 లక్షల మంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారన్నారు. ఆర్టీసీ కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని త్వరలోనే వారికి జీతాలు పెంచి వచ్చిన లాభాల్లో వాటా ఇస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కార్మికుల సమస్యలు, ఇళ్ల స్థలాల విషయం తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రయాణికుల రద్దీ దృశ్య మంచిర్యాల బస్టాండ్‌ను విస్తరించి ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, కార్మికులు, మెకానిక్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి చేస్తున్నాం

- వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు, వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా లోని ఆర్కే 7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడుతూ ఇటీవల జరిగిన 50వ స్ట్రక్చర్ సమావేశాల్లో ఎన్నికల్లో ఇచ్చిన చాలా హామీలు యాజమాన్యంతో పలు అంశాలపై అంగీకారం కుదిరిందన్నారు. మైనింగ్ స్టాఫ్ మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని, డిస్మిస్ అయిన జేఎంఈటీలు అందరినీ తిరిగి జేఎంఈటీలుగా తీసుకోనున్నారని, మిగతా డిస్మిస్ ఉద్యోగుల విషయంలో కమిటీ వేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. క్యాంటీన్లను కంపెనీ ఆధ్వర్యంలో నడిపించాలని, ఈపీ ఆపరేటర్లకు డీ నుంచి సీ, సీ నుంచి బీ గ్రేడ్ ఖాళీలతో సంబంధం లేకుండా టైం బౌండ్ పదోన్నతులు ఇవ్వనున్నారని వివరించారు. గతంలో రెండువేల ర్యాంకు వరకు ఉన్న ఉద్యోగుల పిల్లలకు ఉపకార వేతనాలు ఇవ్వగా, ఇప్పుడు ఎనిమిది వేల ర్యాంకు వరకు ఇవ్వడానికి ఒప్పుకున్నారన్నారు. ఉద్యోగులకు ఇన్సెంటివ్ పునరుద్ధికరణ, వేజ్ బోర్డులో లేని పదకొండు అలవెన్స్‌లు పెంచడం, కొత్తగా ఇన్సెంటివ్‌లు ఇవ్వడానికి కమిటీ వేయడం, ఎస్-1 తీసివేసేందుకు ఆడిట్ బోర్డు అనుమతి తీసుకొని అమలు చేయడం, మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ డిపెండెంట్ కేసులు వచ్చే నెల సీఎండీతో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో చర్చించనున్నారన్నారు. పెరిక్స్ మీద టాక్స్, సొంత ఇంటి పథకం మీద చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్ కిషన్ రావు, ఫిట్ కార్యదర్శిలు సారయ్య, సదానందం, నర్సింగరావు, లక్ష్మణ్, మురళి చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకులు పారుపల్లి రాజేందర్, చంద్రశేఖర్, పిట్ నాయకులు సదానందం, యాదగిరి, పవన్, బానేష్, తిరుపతి, రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలి

- జీఎం పర్సనల్ ఐఆర్ పీఎం కవిత నాయుడు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలని కార్పొరేట్ జనరల్ మేనేజర్ పర్సనల్ ఐఆర్ పీఎం కవిత నాయుడు సూచించారు. గురువారం శ్రీరాంపూర్ గనిలోని ఉద్యోగులకు అల్పాహారాన్ని అందించే క్యాంటీన్, శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత నాయుడు శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఉద్యోగులకు అందిస్తున్న అల్పాహరన్ని పరిశీలించి నాణ్యమైన అల్పాహరన్ని అందించాలని, అలాగే క్యాంటీన్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలని, నాణ్యమైన ముడి సరుకులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతూ ఉద్యోగులు వారి పనులను సక్రమంగా నిర్వర్తించాలని, అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులకు కావాల్సి గ్యాస్, నిత్యావసర సరకులను నాణ్యమైనవి అందజేయాలనీ తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎంలు పి.అరవింద రావు, అజయ్ కుమార్, రాజగోపాల్, పర్సనల్ మేనేజర్ మూర్తి, సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ పాలకుర్తి రాజు, సీనియర్లు పీఓ పి.కాంతారావు, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



డీహెచ్‌పీ జాతీయ మహాసభల కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జనవరి 5, 6, 7 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని డీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి పొచన్న కోరారు. గురువారం అంబేద్కర్ విగ్రహం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్న, దళిత వర్గాల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ దళితుల దరిచేరడం లేదన్నారు. దళితులను ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, కోసం కుల వివక్షత, కుల నిర్మూలనకు ఎస్సీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని, సబ్ ప్లాన్ నిధులు నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరారు. జనవరిలో నిర్వహించే మహాసభల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం, నాయకులు మొగిలి లక్ష్మణ్, లింగంపల్లి భానుచందర్, పొనగంటి ఏసేపు, కల్లేపల్లి సునీల్, రాంసాగర్, దానపల్లి ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్

నవతెలంగాణ-మందమర్రి



ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మందమర్రి పట్టణానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు దంపతులు, వెన్నంటూ ఉండి ముందుకు నడిపించి విజయానికి కృషి చేసిన పీసీసీ సభ్యులు నూకల రమేష్‌కి ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

బెల్లంపల్లి కేంద్రంలోని తాపి సంఘ భవనంలో డిసెంబర్ 8న జరిగే టీఎస్‌యూటీఎఫ్ 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహాసభలలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ పథకం పునరుద్దరించాలన్నారు. కేజీబీవీ, యుఆర్ఎస్, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్‌టీలకు మినిమం బేసిక్ పే ఇవ్వాలన్నారు. మహా సభలో ఇలా పలు తీర్మాణాలు ఆమోధించి, ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సాకారమయ్యేలా చూడడం జరుగుతుందని తెలిపారు. జిల్లా మహాసభలల్లో ఉపాధ్యాయులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కార్పొరేట్‌లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై ఏదీ..?

- రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌లపై చూపుతున్న శ్రద్ధ ప్రజలపై చూపడం లేదని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్ చౌరస్తా వద్ద మోడీ మోసం-దేశం ఆగం పేరుతో నిరసన చేపట్టారు. రహదారిపై రాస్తారోకో చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టార్రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 సంవత్సరాల కాలంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేవలం కార్పోరేట్ శక్తులకు కామ్ముకాస్తూ దేశాన్ని నాశనచేస్తుందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు అయోమయంలో ఉన్నారని తెలిపారు. బీజేపీ నాయకులకు ప్రజల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకుని అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. తాము చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధామా అని బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. రానున్న రోజుల్లో అభివృద్ధికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు ఏ నిరసనకు చేపట్టిన తాము సమాధానం చెబుతామన్నారు. సాధ్యమైతే అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అడ్డుకొవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మండల అధ్యక్షులు పింగళి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణ చందర్ రావు, గడ్డం శ్రీనివాస్, ఆకుల రాజేందేర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నలిమేలా రాజు, అంకతి శ్రీనివాస్, కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, యూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పిల్లలు పుట్టిన రెండు సంవత్సరాలలోపు వారిలో ఉన్న లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దితే వారికి ఎలాంటి సమస్య లేకుండా ఉంటాయని మండల విద్యాధికారి హెలెన్ డారతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి ఎంఈఓ ముఖ్య అతితిగా హాజరై మాట్లాడుతూ భవిత కేంద్రంలో అందుచున్న సదుపాయాలు, దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించుట, వాటిని అందజేయడం గురించి తల్లిదండ్రులకు వివరించారన్నారు. పదవ తరగతి హాజరవుతున్న దివ్యాంగ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం నిర్వాహకులు రమేష్, శంకర్, ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట



కాసిపేట

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆటల పోటీలు

కాసిపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల విద్యాధికారి ముక్తవరపు వెంకటేశ్వర స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర స్వామి మాట్లాడుతూ పిల్లలను చులకనగా చూడొద్దన్నారు. పిల్లల పేర్లను పాఠశాలలో నమోదు చేసి వాళ్లకు అవసరమైన పరికరాలను క్యాంప్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాసిపేట కాంప్లెక్స్ హెచ్ఎం మామిడి పెల్లి సాంబమూర్తి, సెక్టోరల్ ఆఫీసర్లు చౌదరి, సత్యనారయణ మూర్తి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉష, ఐఈఆర్పీ శ్రీలత, సీసీఓ రాంబాబు, ఫిజియోథెరపిస్ట్ కుమారస్వామి పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఏరియాలో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-జైపూర్

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మండల పరిధిలో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఏరియాల్లో పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఏరియాలో గురువారం చేపట్టిన పారిశుధ్య పనులతో పాటు గేట్‌వాల్ మరమ్మత్తులు, నీటి సరఫరా తీరును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ కాలనీలో డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మిస్తున్న సైడ్ డ్రైన్ పనులు పరిశీలించి సూచనలు చేశామరన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీపతి బాపురావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



సర్వే డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



సామాజిక సమగ్ర కులగణన వివరాల నమోదు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే డాటా ఎంట్రీ నమోదును పరిశీలించి ఆయన మాట్లాడారు. సామాజిక సమగ్ర ఇంటింటా కులగణన సమగ్ర సర్వేలో భాగంగా సేకరించిన సమగ్ర వివరాలను పకడ్బదీగా నమోదు చేయాలని సూచించారు. సర్వే వివరాలు నమోదు కరదీపికలను భద్రపర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజత్ పాషా, విద్యాధికారి ఆడే ప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నవతెలంగాణ-చింతలమానేపల్లి



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎసైస ఇస్లావత్ నరేష్ తెలిపారు. మండలంలో రవీంద్రణగర్-1 గ్రామానికి చెందిన హరిధాస్ సర్దార్ అనే వ్యక్తి గంగాపూర్ శివారులో కెనాల్ రోడ్ సమీపంలో అమ్మడానికి సిద్ధంగా ఉన్నా 181.30 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విలువ రూ.6000 ఉంటుందని ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలను పున:ప్రారంభించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలను పున:ప్రారంభించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గతంలో 500 మందితో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉండేదని, దానిని ప్రస్తుతం క్రీడా పాఠశాలగా మార్చారన్నారు. ఆశ్రమ పాఠశాల మూసివేతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి పాఠశాల ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో కళాకారుల నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-జన్నారం

హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జిల్లా నిరుద్యోగుల కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు సంఘం నాయకులు కొండుకూరి రాజు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని నిరుద్యోగులైన కళాకారులను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. సాంస్కృతిక సారథి చైర్మన్ రాష్ట్ర నూతన అధ్యక్షురాలు వెన్నెల గద్దర్‌ను నిరుద్యోగ కళాకారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనువోజ్ వెంకన్న, దరువు అంజన్న, నకిరికంటి కిరణ్, మంచిర్యాల్ ఇన్చార్జి కొండుకూరి రాజు,ఆకుల నరసయ్య, ఆవునూరు సత్తయ్య మహిళా విభాగం అధ్యక్షురాలు కొంకటి రాజేశ్వరి, బత్తుల శారద, గొట్టే ఝాన్సీరాణి, మంజుల, సంగీత పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆన్‌లైన్ ఓటింగ్ విధానంలో రెండు వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందిన గుండా శ్యామ్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఎంతో మేలు చేసిందన్నారు. 53000 ఉద్యోగాలు ఇచ్చి చరిత్ర సృష్టించిందని తెలిపారు. దీనిని పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో పాటు గతంలో ప్రభుత్వంలో ఉండి ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీల లోటుపాట్లను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ దండేవిటల్, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ తిరుపతి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం కప్ ఆటల పోటీలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలో అండర్ 18 సీఎం కప్ ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో ఓపెన్ టు ఆల్ అథ్లెటిక్స్‌లో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలుంటాయన్నారు. గ్రామస్థాయిలలో 7, 8 తేదీలలో మండల స్థాయిలో 10నుంచి12 తేదీలలో నిర్వహిస్తామన్నారు. ఈనెల ఆరవ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు.

అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలలో అర్హత కలిగిన క్రైస్తవ అభ్యర్థులు, సంస్థలు సత్కారం పొందేందుకు అర్హత కలిగిన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆర్. రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక సేవారంగం, విశిష్ట వైద్య సేవలు, విద్యాబోధన, సాహిత్యం, కళలు, క్రీడా రంగాలలో 10 సంవత్సరాల పైబడి విశేష సేవలు అందించిన క్రైస్తవులు, విద్య, సామాజిక సేవా రంగాలలో 30 సంవత్సరాలకు పైగా సేవ చేస్తున్న క్రైస్తవ సంస్థలు గౌరవ సత్కారం పొందేందుకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీఎంఎఫ్‌సీ.ఇన్‌లో, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నిర్ణీత నమూనాలో తమ దరఖాస్తులను ఈ నెల 6 నుండి 10లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో ఎఫ్-5బిలో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాలకు 040-23391067లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఐఎన్‌టీయూసీతోనే విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(రి.నెం.327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనగాల శ్రీధర్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ సర్వీసు రూల్స్ ఇప్పించేందుకు కృషి చేస్తానని, వారికి త్వరలోనే గ్రేడ్ ఛేంజ్ ప్రమోషన్ ఇప్పిస్తామని అన్నారు. అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, కంపెనీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి, రాష్ట్ర చీఫ్ ఉపాధ్యక్షులు రమేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఎమ్మాజీ సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాపురెడ్డి, శ్రీనివాస్, నాయకులు రామకృష్ణ, శ్రీదేవి, శ్రీనివాస్, అశోక్, రయీస్, రాంచందర్, బుచ్చిబాబు, పాషా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశం అనంతరం యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా చంద్రశేఖర్, కార్యదర్శిగా ఎమ్మాజి సతీష్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కందుల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ, కోశాధికారిగా అశోక్‌ను ఎన్నుకున్నారు.

ముగిసిన ఎన్‌సీసీ రెండో వార్షిక శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ రక్షణలో భాగస్వాములు కావాలనే విద్యార్థులకు ఎన్‌సీసీ వేదిక అని, పది రోజులు క్యాంప్ ఎన్‌సీసీ లక్ష్యాలు, కర్తవ్యాలతో పాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందని కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ అన్నారు. గురువారం డీటీసీలో ఎన్‌సీసీ 2వ వార్షిక శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కెడెట్ల గౌరవ వందం స్వీకరించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న కెడెట్లకు మెడల్స్ అందించారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పది రోజుల పాటు 2వ వార్షిక శిక్షణ శిబిరంలో అనేక అంశాలను నేర్చుకున్నారు. ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ట్రాఫిక్ నిబంధనలు, ఆయా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. పది రోజుల పాటు మిలటరీ శిక్షణను కెడెట్లకు అందించామని పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణాలతో కెడెట్లతో నాయకత్వ లక్షణాలతో పాటు దేశ భక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ జగ్రాం, లెఫ్టినెంట్ ఐలయ్య, ప్రశాంత్, వివిధ స్కూళ్లకు చెందిన ఎన్‌సీసీ కెడెట్లు, సీనియర్ జేసీఓ భగీరథ్, శిక్షణ జేసీఓ బ్రిజేష్ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించి..సూచనలు చేసి

నవతెలంగాణ-కెరమెరి



ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం మండలంలోని సుల్తాన్‌గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే సరుకులు, కోడిగుడ్లు, కూరగాయలను పరిశీలించారు. అదనపు మరుగుదొడ్ల నిర్మాణ పనులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. సకాలంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు ప్రతిరోజు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మౌలిక వసతుల కల్పన, పాఠశాల అభివృద్ధికి చేయాల్సిన పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్, అధికారులున్నారు.

హక్కులపై బాలలు అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల క్రీడ పాఠశాలలో సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలలకు హక్కులు వాటి సంరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని వాటి నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాల్య వవాహాల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని లేదా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, చీఫ్ లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నరహరి, అసిస్టెంట్ కౌన్సిల్ అంజనీ దేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



నవతెలంగాణ-నస్పూర్

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయమని, దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. కానీ సామాజిక న్యాయానికి విరుద్ధంగా కేవలం మంత్రి పదవి కోసమే అన్నదమ్ముల్లాంటి మాల, మాదిగల మధ్యలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. బీసీలలో 150కి పైగా కులాలు వారి జనాభా ప్రాతిపదికన ఏ.బి.సి.డిగా వర్గీకరించుకొని పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీల్లోనూ 59 కులాలు కూడా ఏ.బి.సి.డిగా వర్గీకరణ చేసుకొని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పంచుకోవాలని 30 సంవత్సరాలుగా న్యాయమైన డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ పోరాటం చేస్తున్నారన్నారు. మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని, కచ్చితంగా బుద్ధి చెబుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎఫ్ నాయకులు గద్దల బానయ్య, చుంచు శంకర్ వర్మ, గుంపుల స్వామి, నక్క అంజయ్య, చంద్రగిరి నరేష్, నేలవేణి కుమార్, సింహాచలం, అట్కపురం రాయమల్లు, లింగంపల్లి స్వామి, కొండ్ర లింగయ్య, పెరుక సత్యనారాయణ, ఆవునూరి భూమయ్య, కొప్పర్తి రాజేశ్వరి, విమల పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కాగజ్‌నగర్‌లో స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం ఆ సంఘం నాయకులు సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు చేసిన సిఫారసు లేఖను ఆమెకు అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లాలో అధిక సంఖ్యలో కాపు కులస్థులు ఉన్నారనీ, తమకు కమ్యూనిటీ హాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోలెం వెంకటేష్, ఉపాధ్యక్షులు అంగల తిరుపతి, నాయకులు మహేందర్, పెరక మహేష్, గోవిందుల రాజన్న పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఇచ్చోడ

టీఎస్‌యుటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక గురువారం మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రంలో నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ ఎన్నికల పరిశీలకులుగా, జిల్లా కమిటీ సభ్యులు గణేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా మెడపట్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్యాంసుందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వరగంటి అశోక్ మాట్లాడుతూ టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. డీఏలను తొందరగా ఇవ్వాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఫ్ నాయకులు పాల్గొన్నారు.

కోర్టు భవనానికి నిధులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జిల్లా కోర్టు భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి కృషి చేయాలని జిల్లాకు సంబంధించిన బాధ్యుడు హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్, పోర్టు పోలియో జస్టిస్ రాజేశ్వర్‌ను హైకోర్టు సభ్యుడు భార్గవ్ నేతృత్వంలో ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన న్యాయస్థానం ప్రాంగణంలో భవనాల నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని, అయితే ఇవి 10 కోర్టు భవనాలు నిర్మించడానికి సరిపోవన్నారు. జిల్లాలో గిరిజనులు ఎక్కువమంది ఉన్నారని వారికి సత్వర న్యాయం దక్కాలంటే అన్ని వసతులు ఉన్న కోర్టు భవనాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం రూ.90 కోట్ల నిధులు మంజూరు చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడాలని కోరారు. ఈ సందర్భంగా 10 కోర్టు భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వాలతో మాట్లాడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవీందర్, సభ్యులు టి.సురేష్, ఎం.సురేష్, హరీష్, శ్యామ్, జగన్మోహన్ రావ్, రాజీవ్ రెడ్డి, మునీర్, మంతెన రామకృష్ణ, చంద్రకుమార్, ఆకాష్, బోనగిరి సతీష్ బాబు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-దహెగాం





టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి తులసిరామ్ పేర్కొన్నారు. మండల అధ్యక్షుడుగా బాచం పల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రోహిత్, ఉపాధ్యక్షులుగా యాకూబ్, మధులత, కోశాధికారిగా వంశీ, కార్యదర్శులు భారతి, రవి, మహేశ్, సంతోష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సమ్మయ్య, కో కన్వీనర్‌గా వినోద్, మహిళా కమిటీ కన్వీనర్‌గా రజియా, కో కన్వీనర్‌గా సుప్రియ, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా శంకర్, కో కన్వీనర్‌గా బ్రహ్మం, కల్చరల్ కమిటీ కన్వీనర్‌గా స్రుజన, కో కన్వీనర్‌గా స్రవంతి, సోషల్ మీడియా కన్వీనర్‌గా సంతోష్, క్రీడా కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాస్, వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్‌గా వినేశ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్ గోండ్ సేవా సమితి గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని రాయి సెంటర్ అధ్యక్షుడు కొర్వేట జ్ఞానేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాయి సెంటర్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న జిల్లా కేంద్రంలోని రాయి సెంటర్‌లో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆదివాసుల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధిపై చర్చించడంతో పాటు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకొని తమ సమస్యలను విన్నవించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశానికి అన్ని సంఘాల నాయకులు, ఆదివాసులు రావాలని కోరారు. ఈ సమావేశంలో రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందుర్తి సుధాకర్, రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, రాజ్ గొండ్ సేవాసమితి, గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ రాష్ట్ర కన్వీనర్ సిడాం అర్జున్ మాస్టర్, డివిజన్ అధ్యక్షుడు రఘు, కార్య నిర్వహణ అధ్యక్షుడు ఆత్రం చందన్, జిల్లా ఉపాధ్యక్షుడు బాదీరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని లక్ష్మీపూర్ స్టేజి సమీపంలో బుధవారం రాత్రి 10గంటలకు జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడని ఎస్ఐ పి.సతీష్ తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం..నంబాల గ్రామానికి చెందిన రాళ్లబండి సురేందర్(33) బైక్‌పై మంచిర్యాలలో ఉండే తన అక్క వద్దకు వెళ్తుండగా ఎదురుగా లక్షెట్టిపేట వైపు వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి పెళ్లి కాలేదు. తమ్ముడు సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని అన్నదమ్ములకు గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

లారీ ఢీ కొని నిర్మల్‌కు చెందిన అన్నదమ్ములు పోశెట్టి, లక్ష్మణ్ కాళ్లకు గాయాలయ్యాయి. గురువారం మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మహారాష్ట్ర నుండి నిర్మల్ జిల్లాకు బైక్‌పైన వెళ్తున్న సమయంలో 44వ రహదారిపై లారీ ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రులను వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు.

అటవీ సంపద రక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-జన్నారం

అటవీ సంపద రక్షణకు ప్రతి ఒకరు బాధ్యతగా ఉండాలని ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని సింగరాయపేట, దొంగపల్లి గ్రామాలలో గురువారం అటవీ అధికారులు అహగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ పి.రాము మాట్లాడుతు రాబోయే వేసవి దృష్ట్యా రైతులు పంట పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టినప్పుడు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తేనె, ఇప్పపువ్వు, తునికి ఆకు సేకరణ సందర్భంలో అటవీ ప్రాంతంలో ఉండే ఎండు ఆకులకు నిప్పు పెట్టవద్దని తెలిపారు. అహగాహన సదస్సులో ఎఫ్ఎస్ఓ అజమాత్, ఎఫ్‌బిఓ కృష్ణచైతన్య, పెద్ది రాజు, సంతోష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఆదిలాబాద్
శుక్రవారం | డిసెంబర్ 06, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామ్ నిరంజన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విన్నర్ స్కూల్ విద్యార్థులకు గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆయుధాలు, బాంబు డిస్పోజల్ సామాగ్రి వాటి వినియోగం గురించి వివరించారు. పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, అత్యవసర సమయాలలో విద్యార్థులు వినియోగించాల్సిన డయల్-100 గురించి వివరించారు. కార్యక్రమంలో బాంబ్ స్క్వాడ్ టీం రమేష్ రాథోడ్, అర్మోరెర్ రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కనుకుల రాకేష్

నవతెలంగాణ-కాసిపేట



మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కనుకుల రాకేష్ ఎన్నికయ్యారు. గత నెలలో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడగా ఇందులో కనుకుల రాకేష్ భారీ మెజారిటీతో గెలుపొందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీకి మంచి పేరు తీసుకొచ్చే విధంగా నడుచుకుంటానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఎంతగానో సహకరించిన యువతీ యువకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఇంత మంచి అవకాశాన్ని కల్పించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు, మండల అధ్యక్షులు వేముల కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గంతో ప్రశాంతత



నవతెలంగాణ-తాంసి

ఆధ్యాత్మిక మార్గంతోనే కుటుంబాల్లో ప్రశాంతత ఉంటుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం భీంపూర్ మండలంలోని ధనోర గ్రామంలో గత రెండు రోజుల నుంచి కొనసాగుతున్న వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన ఎమ్మెల్యేకు గ్రామస్తులు స్వాగతం పలికి పూలమాలలతో శాలువాతో సన్మానించారు. అనంతరం కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటే భక్తి మార్గం ఎంతో అవసరమని అన్నారు. భక్తి మార్గంతోనే గ్రామాల్లోని కుటుంబాలు సుఖసంతోషాలతో పాటు ఐక్యత పెరుగుతుందన్నారు. గ్రామస్తులందరి ఐక్యతతోనే వెంకటేశ్వర మందిరం నిర్మాణం చేపట్టుకున్నారన్నారు. భీంపూర్ మండలాభివృద్ధి నా లక్ష్యం అన్నారు. అందరి సహకారంతోనే ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. ధనోర గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోవర్ధన్ యాదవ్, అజయ్ యాదవ్, సురేందర్, శంకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్, కన్వీనర్ నాగయ్య, నాయకులు లస్మన్న, సంజీవరెడ్డి, మహేందర్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

యూఎస్‌ఎఫ్‌ఐ నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నామత్కర్ నవీన్, ఉదయ్‌లు గురువారం ఎన్నికయ్యారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, మహేష్ పాల్గొని మాట్లాడారు. నిర్మల్ జిల్లాలో యూఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని 17 మందితో ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాల ద్వారా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, నవీన్, నాగరాజ్, ఇర్ఫాన్, కాజల్, దీక్ష, అమిత్, అరుణ్, వైష్ణవి పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల రాస్తారోకో



నవతెలంగాణ-భైంసా

కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై భైంసాలో బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహిస్తామంటే ప్రభుత్వం, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద మొత్తంలో రాస్తారోకో చేపట్టి రహదారిపై బైఠాయించారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఉన్నామా, లేదా ఇంకా నిజాం పాలన కొనిసాగుతున్నామా అన్నారు. ఉదయం నుంచి మండలాల వారీగా బీజేపీ శ్రేణులు ర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తే పోలీసులు ఫోన్‌లు చేసి అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడతామన్నారు. అనంతరం ప్రోగ్రాం నియోజకవర్గ కన్వీనర్ రాజేష్‌బాబు అధికారుల తీరుపై మండిపడ్డారు. రాస్తారోకోలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని భరంపూర్ గ్రామానికి చెందిన జావిద్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు గడ్డం లస్మన్న, కేదారేశ్వర్ రెడ్డి, మాదూరి మల్లేష్, రమాకాంత్, గంగారెడ్డి, భీంరావు, గంగారాం, గ్రామస్తులు ఉన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన పీఓ

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటు రాణించాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ మాట్లాడుతూ పది కంప్యూటర్ సిస్టంలు, రెండు ప్రింటర్, రెండు ఇన్వర్టర్లు, 40 ఫ్యాన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. కేబీ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నరని, కంప్యూటర్ గ్రూప్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విషయంపై ఇటీవల ఐటీడీఏ పీఓని కలిసి కంప్యూటర్లు, ప్రింటర్, ఫ్యాన్, ఇన్వటర్ అందించాలని కోరడం జరిగిందన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించినందుకు పీఓకు విద్యార్థులు, సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ ప్రవీణ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మితో మహిళలకు లబ్ధి

• జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

మహాలక్ష్మి పథకంతో మహిళలు ఉచిత బస్సును వినియోగించుకొని లబ్ధి పొందుతున్నారని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీజీఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమలు పరచి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు ఉచిత బస్సు సౌకర్యంతో అన్ని రంగాలలో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు డిపో పరిధిలో 11.54 కోట్ల మంది ప్రయాణికులు ఈ పథకాన్ని ఉపయోగించుకున్నట్లు తెలిపారు. దీని ద్వారా డిపోకు రూ.63 కోట్ల లబ్ధి చేకూరిందని అన్నారు. ఉచిత బస్సు పథకాన్ని ఉపయోగించుకుంటూ మహిళలు దూరప్రాంతాలకు వెళ్లి విద్య, వైద్యం వంటి మెరుగైన సేవలను పొందగలుగుతున్నారని తెలిపారు. ఇటువంటి పథకాల ద్వారా మహిళ సాధికరిత సాధించవచ్చు అన్నారు. మహిళలు మరింత మెరుగ్గా ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో ప్రయాణాలు చేసే మార్గాల్లో రద్దీకి తగ్గట్లు బస్సుల సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మహిళలతో కలెక్టర్ ముచ్చటించి ఉచిత బస్సు పథకం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిరంతరం మెరుగైన పారిశుధ్యాన్ని పాటించాలని, మరుగుదొడ్లు, బస్టాండ్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ ఆదిలాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రణీత్ కుమార్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, తహసీల్దార్ రాజు, ఆర్టీసీ అధికారులు, ప్రయాణికులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

• బీజేపీ జన సభలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నవతెలంగాణ-భైంసా

ఎన్నికల్లో ఇచ్చిన హామీల నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేస్తుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి పిలుపుమేరకు ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరు గ్యారంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు పర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, కళ్యాణ లక్ష్మికి తులం బంగారం, ఇంటర్మీడియట్ బాలికలకు స్కూటీలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అసెంబ్లీలో బీజేపీ ఆధ్వర్యంలో 8 మంది ఎమ్మెల్యేలు ఎండగడతామన్నారు. నియోజకవర్గం ప్రజలు, కార్యకర్తలు, నాయకులే తన బలమని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని, ఎవ్వరికి భయపడవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట వివక్ష చూపుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని కలువడం జరిగిందని, వచ్చే బడ్జెట్‌లో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.30కోట్లతో ముధోల్ నుంచి పంచ గుడికి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. తన హయాంలోనే సిరాల ప్రాజెక్టుకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.19కోట్ల నిధులతో పాటు, కనకాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 1500 ఎకరాలకు అదనంగా సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గడ్డెన్న వాగు ప్రాజెక్టు ద్వారా గతంలో లేని విధంగా అదనపు గ్రామాలకు సాగునీరుస్తున్నామన్నారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో 30 డాక్టర్లను నియమించి, ఐసీయూ ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు ప్రోగ్రాం కమిటీ నియోజకవర్గ కన్వీనర్ రాజేష్‌బాబు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ చార్జి షీట్‌ను చదివి వినిపించారు. మహిళలు, రైతులు, విద్యార్థులు ప్రభుత్వం తమకు చేస్తున్న అన్యాయాన్ని సభలో వినిపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రామనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, పైడిపల్లి గంగాధర్, బీజేపీ ప్రోగ్రాం జిల్లా సహ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాయకులు మహిళా నాయకులు, మండలాల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో పర్యటించిన శక్తి అభియాన్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు పర్యటించారు. మూడురోజుల శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివాసీల జీవన విధానాన్ని తెలుసుకోవటానికి వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు ఐదు బృందాలుగా విడిపోయి ఖండాల, పోతగూడ, దార్‌లొద్ది, చీచ్‌ధరి, పోటంలొద్ది, అల్లికోరి గ్రామాల్లో బుధవారం రాత్రి బస చేశారు. గురువారం ఉదయమే ఆదివాసులతో కలిసి రోజువారి పనుల్లో భాగంగా ఇంటి పని, వ్యవసాయ పనులు, చేపలు పట్టటం, వెదురు బొంగులతో బుట్టలు అల్లటం తదితర పనుల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో రాయిసెంటర్ వ్యవస్థ, ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకుని వారు తినే ఆహారాలను రుచి చూశారు. గూడాల్లో పర్యటించిన సభ్యులకు ఆదివాసులు వారి సాంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇందిరా ఫెలోషిప్ కోఆర్డినేటర్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఆదివాసీ చట్టాలు, ఆదివాసీ ఉద్యమాలు, అటవీ హక్కులపై సభ్యులకు వివరించామన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆదిలాబాద్ జిల్లాలో మూడు రోజుల పాటు శక్తి అభియాన్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయని తెలిపారు. మహిళల హక్కులు, రాజకీయంగా, సామాజికంగా, ఉద్యోగ పరంగా హక్కుల కోసం పోరాటం చేయడానికి ఒక వేదిక కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు శక్తి అభియాన్ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి అభియాన్ జాతీయ చైర్మెన్ మణిశర్మ, జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్.సౌజన్య, రాష్ట్ర కోఆర్డినేటర్ శివలాల్, కృష్ణ అల్లావర్, విజయలక్ష్మి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, వివిధ రాష్ట్రాలకు చెందిన శక్తి అభియాన్ కోఆర్డినేటర్లు, ఉమ్మడి జిల్లాకు చెందిన ఇందిరా ఫెలోషిప్ సభ్యులు కృష్ణవేణి, కోవ ఇందిర, కనక ప్రతిభ, కుంరం సింధు, ఆదివాసీ నాయకులు యశ్వంత్‌రావు మహారాజ్, సార్మేడి కోరేంగా దౌలత్ రావు పాల్గొన్నారు.





ముగిసిన శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట ఉత్సవాలు

• ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యేలు



నవతెలంగాణ-ముధోల్

ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో రామాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు ముగిశాయి. గత మూడు రోజుల నుండి ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను బాసర ఆలయంలోని వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయాల్లో అష్ట దిగంబర్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలో ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండగ వాతావరణం నెలకొంది. ముగింపు ఉత్సవాలకు ముధోల్ మాజీ ఎమ్మెల్యేలు బి. నారాయణరావు పటేల్, జి. విఠల్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్‌రావ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ వైస్ చైర్మెన్ సుకన్య రమేష్, సురుగుల పోశెట్టి, అశోక్, రావుల పోశెట్టి, లక్ష్మారెడ్డి, మోహన్ రెడ్డి, మురళి, రావుల శ్రీనివాస్, రామాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

• ఎమ్మెల్యే అనిల్ జాదవ్





నవతెలంగాణ-బజార్‌హత్నూర్

యువత జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. అనంతరం స్థానిక మండల టీమ్‌కు జెర్సీలను ఎమ్మెల్యే చేతుల మీదుగా టీషర్టు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం ఉంటుందని అన్నారు. గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులుగా ఎంపిక అవ్వాలని అన్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం, యువజన సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, మండల నాయకులు కవీందర్, లక్ష్మణ్, చట్ల విలాస్, రాములు, రమణ, చట్ల గజ్జయ్య సాయిచైతన్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ విచారణ

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ వెనుకబడిన తరగతుల కులాలు, కుల సంఘాల ప్రతినిధుల నుండి స్థానిక సంస్థల వారిగా కల్పించవలసిన రిజర్వేషన్ల విషయంలో ఆసక్తి గల అభ్యర్థుల నుండి అభ్యర్థనలు, ఆక్షేపణలు స్వీకరించేందుకు 6న ఉదయం 10.30గంటలకు నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బి.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని బిసి కులస్తులు, కుల సంఘాల నాయకులు ఈ బహిరంగ విచారణకు హాజరై తమ సమర్పణలు, అభ్యర్థనలు, ఆక్షేపణలు, సలహాలను అందజేయాలని తెలిపారు.

రైతుల ఖాతాలలో రూ.10.80కోట్లు జమ

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ.10కోట్ల80లక్షల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 11వేల635 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 673 మంది రైతుల ఖాతాలలో రూ.10కోట్ల80 లక్షలు జమ చేశామని తెలిపారు. జిల్లాలో 13 రైస్ మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేశామని పేర్కొన్నారు.